క్లుప్తంగా

వలపర్ల యువకుడికి డాక్టరేట్



చత్తీస్‌ఘడ్ గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న లక్ష్మీనారాయణ

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన జంజనం లక్ష్మీనారాయణ శుక్రవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 45వ వార్షికోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సమక్షంలో శుక్రవారం రాత్రి లక్ష్మీనారాయణ ఈ పురస్కారం అందుకున్నారు. చత్తీస్‌ఘడ్ గవర్నర్ రామన్ దేక లక్ష్మీనారాయణకు పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ఎలక్ట్రానిక్ టెలి కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనలకుగాను ఈ డాక్టరేట్ పట్టా పొందినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

కారంచేడు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసుకొనే బాణసంచా దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని, లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీ వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు పోలీస్ స్టేషన్‌లో దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో రెండు పెద్ద గోదాములు ఉన్నాయన్నారు. చీరాల–స్వర్ణ దండుబాట రోడ్డులో స్వర్ణ గ్రామ సమీపంలో ఒక గోదాము ఉంటే, చీరాల–పర్చూరు రోడ్డులో కారంచేడు చర్చి సమీపంలో మరో గోదాము ఉందన్నారు. వీటికి ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అనుమతులను దగ్గర ఉంచుకోవాలన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరణ

అద్దంకి/అద్దంకి రూరల్: సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన సీపీఎం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలకు భిన్నంగా సీపీఎం కింది స్థాయి కమిటీల వరకు ప్రతి మూడేళ్లకు ఒకసారి మహాసభలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దానిలో భాగంగా వచ్చే నెల 10వ తేదీన అద్దంకి మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మండల నాయకుడు రఘచంద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ ధరకు శనగ విత్తనాలు

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరకు శనగ విత్తనాలను అందిస్తుందని పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన అధికారులు రైతుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జేజీ 11 శనగల క్వింటా ధర రూ 9400 ఉండగా 25 శాతం సబ్సిడీ మినహాయింపుతో రైతులకు రూ.7050 వస్తుందన్నారు. కాక్ 2 ప్రస్తుత ధర రూ.12 వేలు ఉండగా సబ్సిడీ పోను రైతులకు రూ.9075 వస్తుందని తెలిపారు.

హోం గార్డుకు గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకి గాయాలైన ఘటన శుక్రవారం అద్దంకి సమీపంలో చోటుచేసుకుంది. హోమ్‌గార్డు చికిత్స పొందుతున్న వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఖాదర్‌బాషా శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. అద్దంకి పోలీస్ స్టేషన్‌లో హోమ్‌గార్డుగా పనిచేస్తున్న జే సురేష్‌బాబు శుక్రవారం ఉదయం డ్యూటీకి బైకుపై అద్దంకి వస్తుండగా అద్దంకి సమీపంలోని నల్లవాగు వంతెన వద్ద ఎదురుగా వస్తున్న బైకు ఢీ కొట్టింది. హోం గార్డుకు మొహం మీద గాయాలవడంతో ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

చీటింగ్ కేసు నమోదు

మార్టూరు: చెక్ బౌన్స్ కేసు విత్ డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేయడం.. తీసుకున్న బంగారాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో పోలీస్ స్టేషన్లో శనివారం కేసు నమోదైంది. సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి అనిల్ చౌదరి జే.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన ఈదర సీతామాలక్ష్మి వద్ద సుమారు పదేళ్ల క్రితం రూ.20 లక్షల నగదు తీసుకొని తర్వాత అనిల్ చౌదరి ఆమె చెక్కు ఇచ్చాడు. బ్యాంకులో నగదు లేక చెక్కు బౌన్స్ కావటంతో అనిల్‌పై సీతామాలక్ష్మి అద్దంకి కోర్టులో కేసు వేసింది. కోర్టు ఆమెకు అనుకూలంగా 2023లో డిక్రీ ఇచ్చింది. ఇదిలా ఉండగా అనిల్ చౌదరి తల్లి ఉప్పలపాటి శ్రీదేవి రమాదేవి కూడా సీతామహాలక్ష్మి నుంచి 2014లో 80 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకొని తిరిగి ఆమెకు ఇవ్వలేదు. సీతామహాలక్ష్మి నుంచి తీసుకున్న డబ్బు, బంగారం ఇవ్వకపోగా తల్లీకొడుకులు సీతామహాలక్ష్మిని, కేసు విత్ డ్రా చేసుకోవాలని తమకు అనుకూలమైన మరికొందరితో కలిసి ఆమె కనిపించినప్పుడల్లా అసభ్య పదజాలంతో దూషించటం దాడికి యత్నించటంతో శనివారం సీతామహాలక్ష్మి ఇద్దరిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇక పక్కాగా.. పశుగణన

- ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్న 21వ జాతీయ పశుగణన
- వివరాలన్నీ యాప్‌లో నిక్షిప్తం
- సిబ్బందికి పూర్తయిన శిక్షణ



పాడి రైతులకు పశుగణనపై అవగాహన కల్పిస్తున్న ఎన్యూమరేటర్లు

చీరాల అర్బన్: మన దేశంలో వ్యవసాయం రంగం తర్వాత పాడిపరిశ్రమ కూడా అత్యంత కీలకంగా మారింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ పశుగణన ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశుసంవర్ధకశాఖ పరిధిలోకి వచ్చే జీవాలను గణించనున్నారు. పశుగణనలో సేకరించిన వివరాలను యాప్ ద్వారా నిక్షిప్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ నాలుగు నెలల పాటు జరగనుంది. సర్వే వివరాలను పక్కాగా నిర్వహించాలని ఆ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తక్కువ కాల వ్యవధిలో పశువుల జననాలు, మరణాలు పెద్ద ఎత్తున జరుగుతుండడం, వ్యాపార నిమిత్తం పశువులను వివిధ ప్రదేశాలకు తరలిస్తుండడం వలన పశువుల గణాంకాలలో తరచూ మార్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తుంటారు.

సిబ్బందికి నాలుగు రోజులపాటు శిక్షణ..

గతంలో 2019లో పశుగణన చేశారు. తిరిగి 2023లో జరగాల్సి ఉండగా ఏడాది ఆలస్యమైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 1న నిర్వహించాలని ముందుగా నిర్ణయించినా వర్షాలు, వరదల ప్రభావంతో ఆలస్యమైంది. చీరాల ఏడీ కార్యాలయ పరిధిలో చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాలు ఉన్నాయి. వీటిలో చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో 18 మేజర్ పంచాయితీల్లో 85,745 కుటుంబాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశుగణన కోసం మొత్తం 20 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లను నియమించారు. వీరు ఇంటింటికి వెళ్లి పశువుల వివరాలు సేకరిస్తారు. వాటిని సెన్సస్ మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. పశుగణన మొబైల్ అప్లికేషన్ వినియోగంపై సిబ్బందికి నాలుగు రోజులు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం నుంచి మొదలైన పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లతో పాటు వీధి కుక్కలు, ఆంబోతులను సైతం లెక్కించనున్నారు. 2019లో నిర్వహించిన పశుగణన ప్రకారం ఇప్పటి వరకు చీరాల ఏడీ కార్యాలయ పరిధిలో చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో ఆవులు 1884, గేదెలు 33706, గొర్రెలు 62666, మేకలు 4768, పందులు 131, గుడ్లు పెట్టే లేయర్, బ్రాయిలర్, నాటు కోళ్లతో పాటు వివిధ రకాల కోళ్లు 24278 ఉన్నాయి.

పశుగణనతో ఉపయోగాలిలా..

- పశుగణన చేయడం వలన గ్రామం, మండలంలో పశువుల సంఖ్యపై సంబంధిత అధికారుల వద్ద పక్కా డేటా ఉంటుంది. దీని వలన సీజనల్‌గా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పెరటి కోళ్లు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఎన్ని టీకాలు, వ్యాక్సిన్లు అవసరం, నిల్వ ఉంచాల్సిన టీకాలు, వ్యాక్సిన్లు కావాలనే స్పష్టమైన అవగాహన ఉంటుంది. అలానే పశుపోషణపై ఆధారపడే కుటుంబాలు, పాడిరైతులు, దీనిపై ఆధారపడే మహిళలు, వారికి కల్పించాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై బడ్జెట్ రూపకల్పనకు పశుగణన ఉపయోగపడుతుంది.
- పశుపోషణ, గొర్రెల పెంపకం అధికంగా ఉన్న ప్రాంతాలలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, చిన్న చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, దాణా, పచ్చిమేత కమతాలకు ఇవ్వాల్సిన రాయితీపై ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం కలుగుతుంది.
- పశుసంతతి తక్కువగా ఉన్న చోట్ల పశువుల సంఖ్యను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు అందాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలపై అవగాహన ఉంటుంది.
- పశుసంతతి వృద్ధికి బ్రీడింగ్, ఆర్టిఫిషియల్ స్పెర్మ్ నిల్వలపై ఒక అంచనా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు సమయంలో పశువుల తరలింపు, వాటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

పశుగణనతో ఎంతో ఉపయోగం..



జాతీయ పశుగణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించాం. పశువుల వివరాలను యాప్‌లో నమోదు చేయడంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. పశుగణనకు పాడి రైతులు సహకరించాలి. పాడి రైతులు కచ్చితమైన సమాచారం ఇవ్వడం వలన రాయితీలు, ప్రోత్సాహకాలు, వివిధ మందులు అందించేందుకు వీలుంటుంది.

– డాక్టర్ ఎస్.చిట్టిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్, చీరాల పశువైద్యశాల

చట్టాలపై అవగాహనతో ప్రశ్నించే తత్వం



బల్లికురవలో పోలీసు స్టేషన్ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై



వేటపాలెంలో పోలీస్ హౌస్ గురించి వివరిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ హౌస్‌లాంటి కార్యాక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు వివిధ పరికరాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోలీస్ స్టేషన్‌కి తరలి వచ్చారు. లాకప్, సీసీ కెమెరాలు, 100, 112 పనితీరు, గురించి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి ఎస్సై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి..

అద్దంకి రూరల్/బల్లికురవ: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల ప్రశ్నించే తత్వం అలవరుతుందని అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్, లాకప్ రూమ్‌లు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

- బాల్యదశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవల ముగింపులో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో లాకప్ గదులు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ బీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



అద్దంకిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై

విద్యార్థినులను చూసుకోవాల్సిన బాధ్యత మనదే



విద్యార్థిని వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి సుధ

చీరాల రూరల్: తల్లిదండ్రులకు దూరంగా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినిలను జాగ్రత్తగా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ వసతి గృహ నిర్వహకులకు సూచించారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఉడ్‌నగర్‌లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, ఆనంద నిలయం వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వసతి గృహాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థినిలను ఏవిధంగా చూస్తున్నారనే విషయాలను సంబంధిత వసతి గృహ బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. వంట గదులు, మరుగుదొడ్లు, విద్యార్థినిలు చదువుకునే గదులు, రాత్రి విశ్రమించే గదులను పరిశీలించారు. ప్రతి విద్యార్థినిని విడివిడిగా పలకరించి వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారి యోగ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు వి. సుజాత, కె. విజయకుమారి, పారా లీగల్ వలంటీర్లు ఎస్‌డి. మతిన్, ఎస్ఎం. సుభాని, జెవి. సాయికృష్ణ, ఎస్. ఇర్ఫాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల రికవరీకి ప్రాధాన్యత

చినగంజాం: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెలుగు ఏపీఎం గద్దే సుబ్బారావు అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2011లో సుమారు 13 ఏళ్ల క్రితం రూ.60 లక్షలు సామాజిక పెట్టుబడుల నిధులు గోల్‌మాల్ అయ్యాయని, వెలుగు సంస్థలో పనిచేసే సిబ్బంది, యానిమేటర్‌లు, గ్రూపు లీడర్‌లు, సభ్యులు కలిసి వాటిని పక్కదాని పట్టించారని చెప్పారు. గతంలో దీనిపై పలుమార్లు విచారణ జరిగినప్పటికీ రికవరీ కాలేదన్నారు. గత 20 రోజుల్లో రూ.10 లక్షల నిధులను రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతిభామూర్తులకు నివాళులు



చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయీస్ సభ్యులు

అద్దంకి రూరల్: వివిధ రంగాల్లో విశేష ప్రతిభావంతులైన వారి గురించి తెలుసుకోవాలని రిటైర్డు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పీసీ హెచ్ కోటయ్య అన్నారు. శనివారం రాత్రి స్థానిక చిన్నిశాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిభామూర్తులు మధురస్మృతులు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పౌరాణిక చిత్రాల రూపకర్త కమలాకర కామేశ్వరరావు గురించి వారనాసి రఘురామశర్మ విశ్లేషించారు. ఆలాగే ప్రేమాభిషేకం చిత్రం గురించి లక్కరాజు శ్రీనివాసరావు విశ్లేషించారు. అనితర సాధ్యమైన విజయాలను సొంతం చేసుకున్న ప్రతిభామూర్తులు అక్కినేని నాగేశ్వరరావు, కమలాకరకామేశ్వరరావు అన్నారు. అనంతరం ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరవల్లి సుబ్బారావును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ బెల్లం కొండ రామ్మోహనరావు, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకటరావు, మలాది శ్రీనివాసరావు, ప్రసాదు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బంగారపు గొలుసు దొంగల అరెస్టు

అద్దంకి రూరల్: బంగారం దొంగతనం చేస్తున్న దొంగలను పోలీసులు పట్టుకున్నారు. రెండు నెలల క్రితం అద్దంకి పట్టణంలోని రామ టాకీస్ బజారులో బంగారుపు గొలుసు చోరికి గురైన ఘటనపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా శనివారం ఇద్దరు దొంగలను ఎస్సై ఖాదర్‌బాషా అరెస్టు చేశారు. వారి నుంచి 3 తులాల బంగారపు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలి

చీరాల: చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ షాప్‌ల నిర్వాహకులు ఇక నుంచి విధిగా సమయపాలన పాటించాలని చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్ షాపులు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల్లోపు మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. మద్యం దుకాణాల వద్ద ఎటువంటి పర్మిట్ రూములకు అనుమతి లేదన్నారు. కేవలం మద్యం అమ్మకాలు మాత్రమే చేయాలన్నారు. దుకాణాల వద్ద ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించడానికి అనుమతి లేదన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేయాలని సూచించారు. నిబంధనలు విరుద్ధంగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

షూటింగ్ బాల్ విజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచినందుకు విజేతలను శనివారం అభినందించారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు అనంతరపురం జిల్లాలో 43వ సీనియర్, బాల బాలికల రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో బాపట్ల జిల్లా జట్టు క్రీడాకారులు అనిల్, శివ, వినయ్, కార్తీక్, ఆనంద్, రామ్‌చైతన్య, అనిల్‌కుమార్, రాజశేఖర్, శ్రీరామ్, రామ్‌చరణ్, మురళి, చార్లెస్‌లు అద్భుతంగా ఆడి జిల్లాను తృతీయ స్థానంలో నిలిపారు. ఈసందర్భంగా చీరాలలోని జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇస్తర్ల బాబురావు వారిని ఘన సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటం వలన విద్యార్థులల్లో మానసిక పరివర్తన చెందుతుందని, ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని చెప్పారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు తప్పక ఉంటాయని చెప్పారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన కోచ్‌లు తుమ్మ శ్రీనివాసరెడ్డి, తుమ్మ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రలను ఆయన అభినందించారు.

క్రీడా వికాస కేంద్రానికి మోక్షమెప్పుడో?

- ఏడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం



క్రీడా వికాస కేంద్ర భవనం

పర్చూరు (చినగంజాం): గ్రామీణ క్రీడలను అభివృద్ధి చేయాలని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని సదుద్దేశంతో నిర్మాణం చేసిన క్రీడా వికాస కేంద్రం పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లుతోంది. నియోజకవర్గం కేంద్రమైన పర్చూరులో ఏడేళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేసిన క్రీడా వికాస కేంద్రం ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసుకున్న క్రీడా వికాస కేంద్రం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ఆనవాలుగా మారింది. క్రీడా ప్రాంగణం ప్రారంభానికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులు కొంత నిరాశకు గురవుతున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం అందుబాటులో ఉన్నా దానిని సక్రమ పద్ధతిలో వినియోగించుకోలేక పోతున్నామన్న ఆందోళనలో వారున్నారు. క్రీడా వికాస కేంద్రం ప్రాంగణంలో చిల్లచెట్లు విపరీతంగా పెరిగి, విషసర్పాలు, క్రిమికీటకాదులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఆవరణలోనికి అడుగు పెట్టాలంటేనే భయాందోళనలు కలిగిస్తుంది. ఆకతాయిలు భవనం ప్రాధాన్యత, విలువలను గుర్తెరగకుండా రాళ్లు తీసుకొని కొట్టడంతో భవనం అద్దాలు ధ్వంసం అయ్యాయి. గోడల రంగులు సైతం వెలసిపోయి భవనం శిథిల రూపాన్ని తలపిస్తోంది. గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు అవసరమైన వనరుగా నెలకొని ఉన్న క్రీడా భవనాన్ని వెంటనే ప్రారంభించి క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించాలని క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజలు కోరుతున్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న భాగ్యరాజ్, సిబ్బంది

కారంచేడు: ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశుగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ భాగ్యరాజ్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పశువైద్యశాలలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సిబ్బంది గ్రామాల్లోని పశుపోషకులు, రైతుల ఇళ్లకు వస్తారన్నారు. వారు వచ్చినప్పుడు పశుపోషకులు మీ వద్ద ఉన్న పశువుల వివరాలను తెలిపాలన్నారు. మీరు ఇచ్చిన సమగ్ర సమాచారంతోనే సరైన పశుగణనకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశుగణన సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జిలతో వైద్య మిత్రల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య మిత్రలు

చీరాల రూరల్: ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో అవుట్ సోర్సింగ్ విధానంలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వైద్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం వైద్య మిత్రులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో దీర్ఘకాలంగా చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నప్పటికి తమపట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి మహిళా మిత్రకు ఆరు నెలల జీతంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు సానుకూల పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.రాజు, సిహెచ్. మురళి, జి. అనిల్‌కుమార్, టి. ఫణి కుమార్, కె. ప్రభాకర్‌రావు, ఎ. రిబ్కా, బోయాజ్, ఎ. రాజశేఖర్, ఎ. విజయ్‌శేఖర్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తే సమాజంలో గౌరవం



ఉద్యోగులను సత్కరిస్తున్న వెలుగు సిబ్బంది

చినగంజాం: ఉద్యోగ ధర్మాన్ని చిత్తశుద్ధితో పాటిస్తే సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందని స్త్రీనిధి జిల్లా మేనేజర్ కరుణాకర్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులు బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఏపీఎం జీ సుబ్బారావు అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీలు సాధారణమన్నారు. అయితే పనిచేసే చోట మంచిపేరు తెచ్చుకుంటే ఆసంతోషమే వేరన్నారు. గతంలో ఏపీఎంగా పనిచేసిన అంజిబాబు చీరాల, సీసీలుగా పనిచేసిన కే చిన్నారావు వేటపాలెం, ఎస్ శ్రీనివాసరావులు చీరాల బదిలీ కావడంతో వారిని ఘనంగా శాలువాతో సత్కరించారు. వారికి మండలంలోని వీఓఏలు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంజీ శ్రీనివాసరావు, సీసీలు శ్రీలక్ష్మి, మాధవీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.